సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం ၊ 1 ၊ సెప్టెంబర్ ၊ 2023



రెడీ... 1, 2, 3 !

సైన్యంలో నియామకాల కోసం అగ్నివీర్ ర్యాలీ నేటి నుంచి ఖమ్మంలో జరగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 7 వేల మంది పాల్గొంటారు. 8లో



'గృహలక్ష్మి'కి ఆంక్షలెన్నో..

పేదల సొంతింటి కల నెరవేర్చే గృహలక్ష్మి పథకానికి అనేక ఆంక్షలు విధించడంతో పలువురు ఇబ్బంది పడుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని చోట్ల మధ్యాహ్నం తర్వాత చిరు జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి ఘనంగా సువర్ణ పుష్పార్చన

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో ఘనంగా అర్చన నిర్వహించారు. అనంతరం హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. కాగా, శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఆలయంలో చండీహోమం జరిపించారు. మేళతాళాలతో స్వామివారిని యాగశాలకు తీసుకొచ్చి మండపారాధన, గణపతిపూజ చేశారు. హోమం అనంతరం పూర్ణాహుతి జరిపించారు. చండీహోమంలో పాల్గొన్న 26 మంది భక్త దంపతులకు అర్చకులు అమ్మవారి శేషావస్త్ర ప్రసాదాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు గంధం వెంగళరావు, సంకా వెంకటరామారావు పాల్గొన్నారు.

ప్రతీ దరఖాస్తును విచారించాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల

సూపర్‌బజార్(కొత్తగూడెం): గృహలక్ష్మి పథకానికి వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో విచారించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఈ పథకానికి 86,773 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మండలాల వారీగా తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని, జాబితా ప్రకారం నిష్పక్షపాతంగా విచారణ చేయాలని చెప్పారు. పథకం వర్తింపజేయాలిన్న ఏ ఒక్క దరఖాస్తునూ విడిచిపెట్టవద్దని సూచించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. విచారణ టీంలు దరఖాస్తుదారుడి ఇంటికే వస్తున్నందున సంబంధిత ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. తనిఖీలో అర్హులు, అనర్హుల జాబితాను రూపొందించాలని తెలిపారు. ఈ నివేదికలు తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓలు ధ్రువీకరించాల్సి ఉంటుందని వివరించారు.

ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది సమ్మెబాట



ధర్నా చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది

సూపర్‌బజార్(కొత్తగూడెం): తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో ఇప్పటికే రెండో ఏఎన్‌ఎంలు 16 రోజులుగా సమ్మె చేస్తుండగా.. నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, ఏటీలు, ఫార్మసిస్టులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది సైతం అదే బాట పట్టారు. దీంతో ఆరోగ్య సేవలు నిలిచిపోయాయి. సమ్మె ప్రారంభించిన సిబ్బంది గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ రెండో ఏఎన్‌ఎంలు 16 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోగా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆరోగ్య తెలంగాణలో భాగస్వాములవుతున్న రెండో ఏఎన్‌ంలు, ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా రెండో ఏఎన్‌ఎంలు సమ్మె శిబిరంలో ఉద్యమ నాయకులకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో సజ్జుబేగం, ప్రియాంక, అరుణ, పార్వతి, సుమలత, పుష్ప, రాములమ్మ, సంధ్యారాణి, వీరమ్మ, అనూష, శ్రీనివాసరావు, పావని, అజ్మత్, సంగీత పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు కార్యాచరణ రూపొందించండి

అదనపు కలెక్టర్ రాంబాబు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వానాకాలం ధాన్యం సేకరణకు కార్యాచరణ రూపొందించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. గురువారం ఆయన అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వానాకాలం ధాన్యం కొనుగోలుకు ముందస్తుగా కార్యాచరణ రూపొందించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి జిల్లాలో సాగవుతున్న వరిపంట రకాలను నిర్ణీత ప్రొఫార్మాలో నమోదు చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు సీఎంఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో డీఎం త్రినాద్, డీసీఓ వెంకటేశ్వర్లు, డీఎంఒ అలీం, ఏడీఏ రవికుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకే ఖరారు!



తుమ్మల నాగేశ్వరరావు నివాసంలో రేవంత్‌రెడ్డి, తుమ్మల తనయుడు యుగంధర్, నాయకుడు సాధు రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు సుదర్శన్‌రెడ్డి, మల్లు రవి తదితరులు

అనుచరులతో హస్తం గూటికి చేరనున్న తుమ్మల

- మాజీ మంత్రి ఇంటికి వెళ్లిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- పార్టీలోకి రావాలని ఆహ్వానం..
- పాలేరు నుంచే పోటీకి గ్రీన్‌సిగ్నల్?

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హస్తం గూటికి చేరడం దాదాపు ఖరారైంది. అనుచర నేతలు, కేడర్‌తో వారం రోజులుగా చేసిన మంతనాలతో ఆయన కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు మల్లు రవి, సుదర్శన్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని తుమ్మల ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డిని నాగేశ్వరరావు సన్మానించగా.. ఆయన సైతం శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి కాంగ్రెస్‌లో చేరాలని ఆహ్వానించారు. ఆతర్వాత కాసేపు భేటీ అయ్యారు. ఈమేరకు 10వ తేదీలోగా ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఉన్న తన అనుచరులతో కలిసి తుమ్మల కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి కేసీఆర్ టికెట్ నిరాకరించడంతో మెజార్టీ అనుచరుల నిర్ణయానికి తలొగ్గిన ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

టికెట్ ఆశించి.. భంగపడి

గత ఎన్నికల్లో పాలేరు నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన తుమ్మల అనూహ్యంగా ఓటమి చవిచూశారు. అయితే, కాంగ్రెస్ నుంచి గెలుపొందిన కందాల ఉపేందర్‌రెడ్డి అనంతర పరిణామాల్లో బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో నియోజకవర్గంలో రెండు వర్గాలు ఏర్పడగా విబేధాలు పొడచూపాయి. అయినప్పటికీ పాలేరు టికెట్ తనకేనన్న ధీమాతో తుమ్మల ఉండగా.. కందాల ఉపేందర్‌రెడ్డిని కేసీఆర్ ప్రకటించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన ఓ సమయాన రాజకీయాల నుంచి నిష్క్రమించాలని భావించినా... అనుచరులు, అభిమానుల ఒత్తిడి మేరకు పోటీ చేస్తానంటూ ప్రకటించారు.

ముహూర్తం ఖరారు

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఆపార్టీ నేతలు.. మాజీ మంత్రి తుమ్మల, ఆయన తనయుడు యుగంధర్, అనుచర నేత సాధు రమేష్‌రెడ్డి మరి కొందరిని కలిశారు. ఈ సందర్భంగా రేవంత్ సహా కాంగ్రెస్ నేతలు తుమ్మలను పార్టీలోకి ఆహ్వానించగా.. అనుచరులతో మాట్లాడి చెబుతానని తుమ్మల అన్నట్లు సమాచారం. అయితే, తుమ్మల కాంగ్రెస్‌లో చేరేందుకు సానుకూలంగా ఉన్నందునే రేవంత్‌రెడ్డి ఆయన ఇంటికి వెళ్లారని తెలుస్తోంది. త్వరలోనే నాగేశ్వరరావు తన అనుచర గణంతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సమక్షాన కాంగ్రెస్‌లో చేరనుండగా... ఉమ్మడి ఖమ్మంతో పాటు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పలు నియోజకవర్గాల్లోని అనుచరులు కూడా అదే రోజు కాంగ్రెస్‌లో చేరేలా కసరత్తు చేస్తున్నారు. ఈనెల 10లోగా మంచి రోజు చూసుకుని పార్టీలో చేరికకు ముహూర్తం ఖరారు చేయనున్నట్లు సమాచారం.

పాలేరు నుంచే పోటీ?

తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరడం లాంఛనమే కావడంతో పాలేరు నుంచి పోటీ కూడా ఖరారైనట్లు తెలిసింది. బీఆర్‌ఎస్ తనకు టికెట్ నిరాకరించినా.. కాంగ్రెస్ అభ్యర్థిగా పాలేరు నుంచే పోటీ చేసి గెలిచి సత్తా చాటాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని రోజులుగా జరిగిన చర్చల్లోనూ ఆయన అనుచరులు ఇదే అంశంపై విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. కాంగ్రెస్ నేతలతో చర్చల సందర్భంగానూ ఆయన తనకు పాలేరు టికెట్ ఇస్తేనే చేరతానని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ షరతుకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చాకే రేవంత్‌రెడ్డి కలిశారని సమాచారం.

ఉమ్మడి జిల్లాపై ఎంత ప్రభావం

కాంగ్రెస్‌లో తుమ్మల చేరనుండటంతో ఉమ్మడి జిల్లాలో ఆయన ప్రభావం ఎంత మేరకు ఉంటుందనే చర్చ మొదలైంది. తుమ్మల ఉమ్మడి జిల్లానే కాకుండా రాజధాని చుట్టుపక్కల తన సామాజిక వర్గం ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ప్రభావం చూపుతారని చెబుతున్నారు. ఆయన చేరికను ఉమ్మడి జిల్లాలోని మెజార్టీ కాంగ్రెస్ నేతలు కూడా స్వాగతించినట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో రెండు పార్టీల్లో ఒక వెలుగు వెలిగిన తుమ్మల.. కాంగ్రెస్‌లో చేరితే ఏ మేరకు ప్రభావం చూపగలరన్నది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.

గండుగులపల్లిలో సమాలోచనలు

ముఖ్యమంత్రి కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించాక గత నెల 25న మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా అభిమానులు, అనుచరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభిమానుల కోరిక మేరకు పోటీలో ఉంటానని పేర్కొన్నా ఏ పార్టీలో చేరేది వెల్లడించలేదు. ఆ తర్వాత స్వగ్రామమైన గండుగులపల్లి వెళ్లి అనుచరులు, అభిమానులతో వారం రోజులపాటు మంతనాలు కొనసాగించారు. కాంగ్రెస్‌లోకే వెళ్లాలని కొందరు ఘంటాపథంగా చెప్పగా.. మరికొందరు ఏ నిర్ణయం తీసుకున్నా వెంట నడుస్తామని తెలిపారు.

నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానం

నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తిరుగులేని నేతగా చెలామణి అయ్యారు. ఉద్దండులైన నేతలను రాజకీయంగా ఎదుర్కొన్నారు. మాజీ మంత్రి జలగం ప్రసాదరావు, లక్కినేని జోగారావు వంటి నేతలపై పోటీ చేశారు. సత్తుపల్లి నియోజకవర్గం నుంచి 1983లో ఆయన టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 1985లో కాంగ్రెస్ అభ్యర్థి లక్కినేని జోగారావుపై విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టారు. అప్పటి ఎన్టీఆర్ మంత్రి వర్గంలో చిన్ననీటి పారుదల శాఖ మంత్రిగా పని చేశారు. 1989లో ఓటమి చవిచూశారు. 1994, 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు జలగం ప్రసాదరావు, పొంగులేటి సుధాకర్ రెడ్డిపై విజయం సాధించారు. వరుసగా చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో తొమ్మిదేళ్లు మంత్రిగా పనిచేసి ఉమ్మడి ఖమ్మం జిల్లా, సత్తుపల్లికి గుర్తింపు తెచ్చారు. ఆతర్వాత 2004లో జలగం వెంకటరావుపై ఓడిపోయారు. ఇక 2009లో సత్తుపల్లి ఎస్సీకి రిజర్వ్ కావటంతో ఖమ్మం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన జలగం వెంకటరావుపై స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. అలాగే, 2014లో కాంగ్రెస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌పై పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం 2016లో పాలేరు ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో విజయం సాధించిన ఆయన ఇక్కడినుంచే 2018 ఎన్నికల్లో ఓటమి చవిచూశారు.

కలెక్టర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి



ఎస్పీ వినీత్‌కు రాఖీ కడుతూ..



ఆత్మీయత.. అనురాగం

9లో

అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా జరుపుకున్నారు. సోదరులకు రాఖీలు కట్టేందుకు అక్కా, చెల్లెళ్లు పుట్టింటికి రావడంతో సర్వత్రా సందడి నెలకొంది. రాఖీలు కట్టి, తమ సోదరులు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆడపడుచులు కాంక్షించారు. కాగా, కొత్తగూడెంలో కలెక్టర్ ప్రియాంక అల, అదనపు కలెక్టర్ రాంబాబుకు బ్రహ్మకుమారీస్ బ్రాంచ్ ఇన్‌చార్జ్ ఈశ్వరి రాఖీలు కట్టారు. ఎస్పీ వినీత్‌కు ఉమెన్ ప్రొటెక్షన్ అండ్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా హయగ్రీవ జయంతి





చిన్నారులకు పలకలు అందజేస్తున్న అర్చకులు
(ఇన్‌సెట్) హయగ్రీవుడికి అభిషేకం చేస్తున్న అర్చకులు

- వేడుకగా ముగిసిన పవిత్రోత్సవాలు
- నేటి నుంచి నిత్యకల్యాణాలు పునఃప్రారంభం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో గురువారం హయగ్రీవ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ పరిధిలోని హయగ్రీవుడి ఉపాలయంలో పండితులు వేదమంత్రాలు, భక్తుల శ్రీరామ నామస్మరణల నడుమ హయగ్రీవుడికి ఉదయం ప్రత్యేక స్నపనం, తిరుమంజనం జరిపారు. చిన్నారులకు విద్య ప్రాప్తించాలని ఆకాంక్షిస్తూ దేవస్థానం ఆధ్వర్యంలో పలకలు పంపిణీ చేశారు. కాగా, ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ మేరకు యాగశాలలో మహాపూర్ణాహుతి నిర్వహించి కుంభప్రోక్షణ, పవిత్రావరోపణంతో ముగింపు పలికారు.

నేటి నుంచి నిత్యకల్యాణాలు

పవిత్రోత్సవాల సందర్భంగా నిలిపేసిన నిత్యకల్యాణాలు శుక్రవారం పునఃప్రారంభం కానున్నాయి. అలాగే శ్రావణ మాస మూడో శుక్రవారం సందర్భంగా శ్రీలక్ష్మీతాయారు అమ్మవారికి సామూహిక అష్టోత్తర శతనామ కుంకుమార్చన జరపనున్నారు. ఈనెల 7న శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారికి బేడా మండపంలో ఊంజల్ సేవ, 8వ తేదీన ఉట్ల పండుగ నిర్వహించనున్నారు.

ఉత్పత్తి 100 శాతం

- ఆగస్టులో రికార్డు సృష్టించిన సింగరేణి
- వర్షాల కారణంగా ప్రతీసారి బొగ్గు ఉత్పత్తికి విఘాతమే
- వానలు లేకపోవడంతో నిరాటంకంగా వెలికితీత
- గతేడాదితో పోలిస్తే 23 శాతం అధికం



ఏరియా	ఆగస్టులో ఉత్పత్తి శాతం	ఆగస్టు వరకు ఉత్పత్తి శాతం
కొత్తగూడెం	122	114
ఇల్లెందు	125	124
మణుగూరు	140	127
బెల్లంపల్లి	155	119
మందమర్రి	83	86
శ్రీరాంపూర్	79	81
భూపాలపల్లి	64	66
రామగుండం1	99	94
రామగుండం 2	101	91
రామగుండం 3	100	101
అడ్రియాల	50	47
మొత్తం	100	99

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వర్షాభావ పరిస్థితులు సింగరేణి సంస్థకు కలిసొచ్చాయి. ఆగస్టులో వాన చినుకుల జాడ కరువైపోవడంతో ఉపరితల గనుల్లో (ఓపెన్‌కాస్ట్) ఉత్పత్తి సజావుగా సాగింది. దీంతో ఆగస్టులో ఓవరాల్‌గా 100 శాతం ఉత్పత్తిని సంస్థ సాధించింది.

ఆగస్టు వచ్చిందంటే..

సింగరేణి వ్యాప్తంగా 24 భూగర్భ, 18 ఓపెన్ కాస్ట్ గనులు ఉన్నాయి. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గులో 80 శాతం ఉపరితల గనుల నుంచే జరుగుతోంది. అయితే వర్షం కురిస్తే ఓపెన్ కాస్ట్ మైన్స్‌లో బొగ్గు ఉత్పత్తి చేసే సీమ్‌ల దగ్గర నీరు చేరుకుంటుంది. భారీ వాహనాలు ప్రయాణించలేని విధంగా మారిపోతుంది. ఊటలా మారిన నీటిని భారీ మోటార్లతో తోడి అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేసిన తర్వాతే ఉత్పత్తి ప్రారంభం అవుతుంది. దీంతో మూడు రోజులు వరుసగా వర్షాలు పడితే వారం రోజుల పాటు ఉత్పత్తిపై ప్రభావం పడుతుంది. వానాకాలంలో ఏర్పడిన ఉత్పత్తి లోటును ఆ తర్వాత సీజన్లలో అదనపు ఉత్పత్తి చేయడం ద్వారా భర్తీ చేస్తోంది. అయితే ఈసారి సింగరేణి బొగ్గు గనులు విస్తరించిన గోదావరి లోయ ప్రాంతంలో అడపదడపా తప్ప వర్షాలు పడలేదు. దీంతో ఉత్పత్తిలో సంస్థ దూసుకుపోయింది.

2018 తర్వాత ఇప్పుడే..

సింగరేణి సంస్థ చివరిసారిగా 2018 ఆగస్టులో 100 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించింది. గత నాలుగేళ్లుగా ఈ లక్ష్యం అందని ద్రాక్షగానే మిగిలింది. కానీ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆగస్టులో 100 శాతం ఉత్పత్తి సాధించింది. సింగరేణిలో ఉన్న 11 ఏరియాల్లో ఆరు ఏరియాలు వంద, అంతకు మించిన ఉత్పత్తి సాధించగా ఒక ఏరియాలో 99 శాతం ఉత్పత్తి వచ్చింది. మందమర్రి, శ్రీరాంపూర్, అడ్రియాల, భూపాలపల్లి ఏరియాల్లో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవడంలో సింగరేణి విఫలమైంది. అయితే మిగిలిన ఏరియాల్లో వచ్చిన అదనపు ఉత్పత్తి ఈ లోటును భర్తీ చేసింది. గతేడాది భారీ వర్షాలు కురవడంతో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యంలో 23 శాతం లోటు ఏర్పడింది. ఈసారి ఆ పరిస్థితి లేకపోవడంతో ఆగస్టులో ముందుగా నిర్దేశించుకున్నట్టుగా 50 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. కాగా 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సింగరేణి సంస్థ 78 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది చివరినాటికి ఒడిశాలోని నైనీతో పాటు కొత్తగూడెంలో వీకే, ఇల్లెందులో రొంపేడు ఓసీలలో బొగ్గు తవ్వకాలు ప్రారంభం కానున్నాయి.

వజ్రోత్సవాలకు తరలిన ప్రజాప్రతినిధులు



ప్రత్యేక బస్సులో బయలుదేరుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చుంచుపల్లి : స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించే ముగింపు వేడుకలకు జిల్లా నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు గురువారం ప్రత్యేక బస్సులో తరలివెళ్లారు. వీరిలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, సీఈఓ విద్యాలత, పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కో– ఆప్షన్ సభ్యులు ఉన్నారు.

వీఓఏలకు పెరిగిన 'గౌరవం'

- వేతనాలు పెంచుతూ సర్కారు నిర్ణయం
- జిల్లాలో 957 మందికి లబ్ధి



ఆందోళన చేస్తున్న వీఓఏలు (ఫైల్)

చుంచుపల్లి: మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనలో కీలకపాత్ర పోషిస్తున్న వీఓఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)లకు రాష్ట్ర ప్రభుత్వం రక్షాబంధన్ సందర్భంగా తీపి కబురు అందించింది. ప్రస్తుతం వారికి చెల్లిస్తున్న గౌరవ వేతనాన్ని రూ.5 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం వారికి రూ.3,900 ఉండగా, మరో రూ.1,100 పెంచింది. ఐకేపీ సెర్ప్ విభాగంలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తూ మహిళా సంఘాలకు సకాలంలో రుణాలు అందించడంలో వీఓఏలు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 957 మంది వీఓఏలకు లబ్ధి చేకూరనుంది. పెరిగిన వేతనాలు సెప్టెంబర్ నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం జిల్లాలోని 22 మండలాల పరిధిలో 18,181 స్వయం సహాయక సంఘాలు ఉండగా, అందులో 1,79,517 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరికి 957 మంది వీఓఏల ద్వారా బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు పంపిణీ చేస్తున్నారు. కాగా, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు ఈ ఏడాది ఏప్రిల్ 17 నుంచి 44 రోజుల పాటు నిరవధిక సమ్మె చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ హామీతో అప్పట్లో సమ్మె విరమించగా.. రక్షాబంధన్ కానుకగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంది.

కనులపండువగా కల్యాణమహోత్సవం



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచ : పట్టణంలోని శ్రీనివాసగిరిపై వేంచేసి ఉన్న శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని కనుల పండువగా కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు తోలేటి నగేశ్ శర్మ, ఆరుట్ల ఫణిరాజాచార్యులు, అభిరామాచార్యులు ఆధ్వర్యంలో జరిపిన ఈ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తుల కోసం శ్రీనివాసగిరి భక్త సమాజ మండలి ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్త సమాజ మండలి అధ్యక్షుడు ఆరుట్ల లక్ష్మణ్, సలహా మండలి కన్వీనర్ మిట్టపల్లి నరసింహారావు, కోశాధికారి తాటికొండ శ్రీలత, పిట్టా లక్ష్మారెడ్డి, కళావతి, సంఘమిత్ర, జిన్న రమేశ్, అంబేద్కర్, సందీప్, శ్రీనివాస్, సుబ్బయ్య, నారాయణ, శ్రీను, వెంకటనారాయణ పాల్గొన్నారు.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం, చుంచుపల్లి ప్రాంతాల లబ్ధిదారులకు గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి, తహసీల్దార్ పుల్ల య్య, కౌన్సిలర్లు సహారాబేగం, మోరె రూప, కూరపాటి విజయలక్ష్మి, అంబుల వేణుగోపాల్, కంచర్ల జమలయ్య, విజయ్‌కుమార్, ఎంపీటీసీ రుక్మిణి, సర్పంచ్‌లు వెంకటమ్మ, రతన్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు భీమా శ్రీధర్, యూసుఫ్, రావి రాంబాబు, కంభంపాటి దుర్గాప్రసాద్, మసూద్, మోరె రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సింగరేణి సూపర్‌బజార్ ఎండీగా సుధాకర్


సామ్యేల్ సుధాకర్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి సంస్థ సూపర్‌బజార్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎం.సామ్యేల్ సుధాకర్ నియమితులయ్యారు. ఈ విషయమై కార్పొరేట్ ఈఈ సెల్ జీఎం కవితానాయుడు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సూపర్‌బజార్ ఎండీగా విధులు నిర్వర్తించిన ఈజీఎస్.ప్రకాశ్‌రావు ఉద్యోగ విరమణ చేయడంతో, కొత్తగూడెం ఏరియా ఏజీఎం పర్సనల్‌గా విధులు నిర్వర్తిస్తున్న సామ్యేల్ సుధాకర్‌ను నియమించారు. ఈసందర్భంగా ఆయనకు జీఎం పర్సనల్, సూపర్ బజార్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు బి.హన్మంతరావు గురువారం ఉత్తర్వులు అందజేశారు.

కొత్తగూడెం ఫైర్ ఆఫీసర్‌గా పుల్లయ్య


ఫైర్‌ఆఫీసర్ పుల్లయ్య

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌గా గుండా పుల్లయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. అశ్వారావుపేటలో లీడింగ్ ఫైర్‌మన్‌గా పనిచేస్తున్న ఆయన్ను ఉన్నతాధికారులు పదోన్నతిపై కొత్తగూడెం అగ్నిమాపక శాఖ కార్యాలయానికి బదిలీ చేశారు.

ఆరోగ్యమాత చర్చిలో దశాబ్ది ఉత్సవాలు


ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

పాల్వంచ: పట్టణంలోని ఆరోగ్యమాత చర్చిలో బుధవారం రాత్రి నుంచి దశాబ్ది ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 8వ తేదీ వరకు వేడుకలు కొనసాగనుండగా, తొలిరోజు చర్చి ప్రాంగణంలో పండుగ పతాకాన్ని ఏలూరు పీఠాధిపతి రాజెర్షిపులిమెర జయరావు ఆవిష్కరించారు. భక్తులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు రాజేశ్ పుడుమల బాల, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

భారీ కంటైనర్‌తో ట్రాఫిక్ జామ్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం బ్రిడ్జి వద్ద భారీ యంత్రాలతో పెద్ద కంటైనర్ వస్తుండటంతో గురువారం బ్రిడ్జిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఇలాంటి పెద్ద వాహనాలను అర్ధరాత్రి సమయాల్లో మాత్రమే పట్టణంలోకి, వంతెనలపైకి అనుమతించాలని, లేకపోతే ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పలువురు వాహనాదారులు పేర్కొన్నారు.

వృద్ధురాలిపై లైంగిక దాడి

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

టేకులపల్లి: మండలంలోని మారుమూల ఏజెన్సీ గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధురాలిపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె భర్త కొన్నేళ్ల క్రితమే మృతి చెందాడు. కుమార్తెలు, కుమారులకు వివాహాలు కాగా, ఆమె ఒంటరిగా ఉంటోంది. ఇది గమనించిన గుర్తు తెలియని కామాంధుడు మంగళవారం రాత్రి వృద్ధురాలి ఇంట్లోకి చొరబడ్డాడు. ఆమె పట్ల దురుసుగా ప్రవర్తించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత డబ్బుల కోసం ఇంట్లో సామగ్రి చిందర వందరగా పడేశాడు. రాయలేని పరిస్థితిలో వృద్ధురాలు పడి ఉంది. బుధవారం స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా గురువారం పలువురు అనుమానితులను డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు పోలీసు స్టేషన్‌లో విచారించినట్లు సమాచారం.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ములకలపల్లి : ఆరుగురు పేకాటరాయుళ్లను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. మండల పరిధిలోని చాపరాలపల్లి శివారు పాములేరు వాగు సమీపంలో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.5,610 నగదు, 2 బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

పాల్వంచలో..

పాల్వంచ: పట్టణ శివారు కరకవాగు వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.5,770 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ రాఘవయ్య తెలిపారు.

అన్నదమ్ముల ఘర్షణ

ఇల్లెందు: మండలంలోని మామిడిగుండాల గ్రామపంచాయతీ రాజ్యా తండా గ్రామానికి చెందిన అన్నదమ్ములు ధారావత్ వినోద్, భిక్షం పరస్పరం ఘర్షణ పడ్డారు. దీంతో వినోద్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

‘గృహలక్ష్మి’కి ఆంక్షలెన్నో..

- పరిశీలనకు కూడా నోచుకోని గిరిజనేతరుల దరఖాస్తులు
- అటవీభూమి చూపించిన దరఖాస్తుల పరిస్థితి అంతే..
- పదమూడు గ్రామాల్లో నూరు శాతం అనర్హత
- ఆందోళనలో దరఖాస్తుదారులు.. చేతులెత్తేసిన అధికారులు


విజయలక్ష్మినగర్‌లో గిరిజనేతరుల స్థలం ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఆర్డీఓ శిరీష

ఇల్లెందురూరల్: పేదలకు సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. సొంత స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు సాయం అందించనుంది. ప్రభుత్వ ప్రకటనతో ప్రజల నుంచి విశేష స్పందన కనిపించింది. గడువు తక్కువగా ఉన్నా వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. తీరా పరిశీలన సమయంలో అధికారులు వల్లె వేస్తున్న నిబంధనలు దరఖాస్తుదారులను విస్మయానికి గురి చేస్తున్నాయి.

ఏం జరుగుతోందంటే..

ఎవరైనా వ్యవసాయ భూములు కొన్న సమయంలో దస్తావేజులు పక్కాగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. బాండ్ పేపర్‌పై వివరాలు నమోదు చేయించుకొని సాక్ష్యులు, సరిహద్దు రైతులు, గ్రామపెద్దల సంతకాలు తీసుకుంటారు. వాటి ఆధారంగా వీలైతే నిబంధనలకు అనుగుణంగా పట్టా చేయించుకుంటారు. కానీ, 1970కి ముందు ఇంటి జాగాలకు అంతగా డిమాండ్ లేకపోవడంతో స్థలాల కొనుగోలు సమయంలో తెల్లకాగితంపై రాసుకునే వారు. దీని ఆధారంగా అధికారులు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న గిరిజనేతరుల నుంచి 1970కి ముందు కొనుగోలు చేసినట్లు పక్కా ఆధారాలు చూపించాలని స్పష్టం చేస్తున్నారు. ఇల్లెందు మండలంలో దరఖాస్తు చేసుకున్న 1,785 మంది దరఖాస్తుదారుల్లో ఒక్కరి వద్ద కూడా అలాంటి ఆధారాలు లేకపోవడంతో వారి దరఖాస్తులను అధికారులు పక్కన పెట్టేశారు. జిల్లా వ్యాప్తంగా ఇదే తరహాలో పరిశీలన జరగడంతో దరఖాస్తుదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్‌కార్డుల పరేషాన్..

కుటుంబంలో ఒకరికి మాత్రమే గృహలక్ష్మి పథకం వర్తింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, కొత్త రేషన్‌కార్డులు అనేక ఏళ్లుగా మంజూరు చేయకపోవడంతో కొత్తగా వివాహమైన వారు.. అప్పటివరకు ఉమ్మడి కుటుంబంగా ఉండి విడిపోయిన వారు.. ఒకే రేషన్‌కార్డులో కొనసాగుతున్నారు. గృహలక్ష్మి నిబంధనలతో రేషన్‌కార్డులను పరిశీలించి అందులో ఒక మహిళ పేరిట మాత్రమే మంజూరు చేస్తున్నారు. దీంతో కుటుంబం నుంచి వేరుపడిన ఇతరులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం స్లాబ్ ఉన్న ఇంట్లో నివాసం ఉంటున్నా, ఇంట్లో ఎవరైనా ఉద్యోగులు ఉన్నా.. ఆయా దరఖాస్తులపై అనర్హత వేటు వేస్తున్నారు. స్థానికతను కూడా పరిగణనలోకి తీసుకోవడంతో చాలా మంది దరఖాస్తుదారులు గృహలక్ష్మి పథకానికి దూరమయ్యే పరిస్థితి నెలకొంది.

ఇబ్బందికరంగానే..

అధికారులు చెబుతున్న నిబంధనలు గిరిజనేతరులతోపాటు గిరిజనులకు కూడా ఇబ్బందికరంగా మారాయి. అటవీ భూముల్లో ఉన్న గ్రామాల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు పక్కన పెడుతున్నారు. ఇలా ఒక్క ఇల్లెందు మండలంలోనే 13 గ్రామాల పరిధిలో వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించకుండా పక్కన పెట్టేశారు. సుభాష్ నగర్, లలితాపురం, ఇందిరానగర్, బాలాజీనగర్, సంజయ్‌నగర్, ఆజాద్‌నగర్, పోచారంతండా, అమర్‌సింగ్‌తండా, బోయితండా, మర్రిగూడెం, రామకృష్ణాపురం, ఒడ్డుగూడెం, నెహ్రూనగర్‌తండా, ధనియాలపాడు, బాలాజీతండా, రాఘబోయినగూడెం, బోడియాతండా, జింకలతండా గ్రామాలు పూర్తిగా అటవీ భూభాగంలో ఉన్నట్లు అటవీ, రెవెన్యూ శాఖల రికార్డుల్లో నమోదై ఉన్నాయి. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్న ఆ గ్రామాల్లో కేవలం గృహలక్ష్మి పథకం మంజూరుకు వచ్చేసరికి అటవీభూములు గుర్తుకురావడం విమర్శలకు తావిస్తోంది.

ఇన్ని ఆంక్షలు ఎన్నడూ చూడలేదు



గృహలక్ష్మి పథకంలో భాగంగా పక్కా ఇంటిని నిర్మించుకోవాలన్న ఆకాంక్షతో దరఖాస్తు చేసుకున్నాం. గిరిజనేతరుల దరఖాస్తులు పరిశీలించడం లేదని అందునా మేము దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ప్రాంతం అటవీభూమి అని దరఖాస్తులు పక్కనపెట్టారు. ఇంటి మంజూరుకు ఇన్ని ఆంక్షలు ఎన్నడూ చూడలేదు.

–ఆళ్ల శిరీష, గృహిణి, సుభాష్‌నగర్

దరఖాస్తుదారులకు న్యాయం చేయాలి



మండల వ్యాప్తంగా అటవీ భూములు విస్తరించి ఉన్నాయి. ప్రభుత్వ పరంగా అన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఆయా గ్రామాలకు వర్తింపజేస్తున్నారు. గతంలో ఇందిరమ్మ పథకం కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా అమలైంది. కానీ, గృహలక్ష్మి పథకం విషయంలో అటవీభూములని దరఖాస్తులను తిరస్కరించడం సరైందికాదు. ఉన్నతాధికారులు పరిశీలించి న్యాయం చేయాలి.

–నూనావత్ తిరుపతి, సర్పంచ్, ధనియాలపాడు

నిబంధనల మేరకు పరిశీలన



గృహలక్ష్మి దరఖాస్తులను నిబంధనల మే రకు పరిశీలిస్తున్నాం. క్షేత్రస్థాయిలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయిలో ఐదుగురు అధికారుల బృందం దరఖాస్తులను పరిశీలించిన తరువాతే ఆమోదం తెలుపుతున్నాం. ప్రభుత్వం రూపొందించిన నిబంధనలను అతిక్రమించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పెండింగ్ దరఖాస్తుల విషయంలో తదుపరి ఉత్తర్వులు అందిన తరువాతే పరిశీలిస్తాం.

–రవికుమార్, తహసీల్దార్, ఇల్లెందు

మద్యం మత్తులో యువకుల హల్‌చల్

అశ్వాపురం: మండల కేంద్రంలోని మణుగూరు –కొత్తగూడెం ప్రధాన రహదారిపై ఆర్‌అండ్‌బీ భవనం వద్ద, కూరగాయల మార్కెట్ వద్ద గురువారం మద్యం మత్తులో పలువురు యువకులు హల్‌చల్ చేశారు. మండల కేంద్రానికి చెందిన యువకులు మద్యం మత్తులో రెండు గంటలపాటు రెండు గ్రూపులుగా గొడవ పడి కొట్టుకున్నారు. వచ్చిపోయే వాహనాలు ఆపుతూ నానా రభస సృష్టించారు. రెండు గ్రూపుల తగాదాలో ఓ బయటి వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో వచ్చిన పోలీసులు యువకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

భద్రాద్రి ఆలయ ముద్ర ఉన్న శాలువాలు స్వాధీనం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం ముద్రతో ఉన్న 13 శాలువాలను మాడవీధుల్లో ఉన్న ఓ షాపులో గురువారం రామాలయ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దేవస్థానం ముద్రతో ఉన్న శాలువాలు కేవలం దేవస్థానంలోనే విక్రయించాల్సి ఉంది. ఆలయ సిబ్బంది సహకారంతోనే దేవస్థానం నుంచి ఈ శాలువాలు బయటకొచ్చాయా? మరెవరైనా వీటిని అక్రమంగా తయారు చేశారా అనే కోణంలో అధికారులు విచారణ చేస్తున్నారు. ఈ తనిఖీల్లో ఈఈ రవీంద్రనాథ్, ఏఈఓ భవానీ రామకృష్ణ పాల్గొన్నారు.

చిన్న అరుణాచలంలో గిరిప్రదర్శన


అరుణగిరి ప్రదక్షణలో పాల్గొన్న భక్తులు

దుమ్ముగూడెం : తమిళనాడులోని అరుణాచలం మాదిరిగా దుమ్ముగూడెం మండలం నర్సాపురం గ్రామంలోని శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ చిన్న అరుణాచలేశ్వర ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం అరుణగిరి ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు శివనాగస్వామి మాట్లాడుతూ ఆలయంలో తొలిసారిగా అరుణగిరి ప్రదక్షణ చేపట్టామని, ఇక నుంచి ప్రతీ పౌర్ణమికి ఉంటుందని పేర్కొన్నారు. ఇక్కడ అరుణాచలేశ్వరుడు సహస్ర భుజాలు, సహస్ర శీర్షాలతో సహస్ర లింగంగా వెలుగొందుతున్నాడని తెలిపారు.

గణేష్ ఉత్సవ కమిటీ ఎన్నిక


ఉత్సవ కమిటీ సభ్యులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం గణేష్ ఉత్సవ కమిటీని గురువారం పట్టణంలోని వివేకానంద హైస్కూల్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రంగాకిరణ్, గౌరవ అధ్యక్షులుగా కంచర్ల చంద్రశేఖర్, వందనపు శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా దారా రమేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో గడిదాసి వెంకటేశ్వర్లు, ఎస్.వీ.కే.శర్మ, సీరా చిరంజీవి, దుర్గాప్రసాద్, లక్ష్మణ్, గుమలాపురం సత్యనారాయణ, కూరపాటి రవీందర్, చంటేశ్వర్, జల్లారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బైక్, ఆర్టీసీ బస్సు ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న బాలుడు

టేకులపల్లి: ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఇల్లెందు మండలం 21 ఏరియాకు చెందిన సైకిల్ మెకానిక్ నీలపు సతీష్ రెడ్డి ఇల్లెందు మైనారిటీ గురుకులంలో ఐదో తరగతి చదువుతున్న తన మేనల్లుడు బైరెడ్డి యశ్వంత్‌రెడ్డిని తీసుకుని రాఖీ పండుగకు గురువారం బైక్‌పై అశ్వాపురం మండలం జగ్గారం గ్రామంలోని అక్క ఇంటికి వెళ్లాడు. ఆమె రాఖీ కట్టాక తిరిగివస్తున్నారు. ఈ క్రమంలో ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సులానగర్ పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం, ఆ తర్వాత హైదరాబాద్ తీసుకెళ్లారు. ఏఎస్‌ఐ సూర్య ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

అసిస్టెంట్ కానిస్టేబుల్‌ను హతమార్చిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో ఘటన

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో రక్షాబంధన్ వేడుకల్లో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనేందుకు స్వగ్రామానికి వెళ్లిన ఓ అసిస్టెంట్ కానిస్టేబుల్‌ను మావోయిస్టులు కిడ్నాప్ చేసి, దారుణంగా హతమార్చారు. బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తోయ్నార్ క్యాంపులో అసిస్టెంట్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న బుద్రం అవలం (33) మూడు రోజుల క్రితం స్వగ్రామం జంగాకు వెళ్లాడు. బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై అతని మేనల్లుడిని గంగులూరు సమీపంలోని దుపాలిపారాలో దింపి వస్తుండగా గ్రామ శివారులో ఆపి బుద్రం అవలంను కిడ్నాప్ చేశారు. గురువారం ఉదయం కత్తులు, గొడ్డళ్లతో దారుణంగా హతమార్చి మృతదేహాన్ని దుపాలిపారా శివారులోని రహదారిపై పడేశారు. స్థానికులు గుర్తించి గంగులూరు పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గంగులూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఘటనపై జిల్లా ఎస్పీ అంజనేయవర్షణీ మాట్లాడుతూ మావోయిస్టులు ఇలాంటి పిరికిపంద చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. కింది స్థాయి ఉద్యోగి సెలవుపై వెళ్లిన సమయంలో నిరాయుధుడిని చేసి హతమార్చడం సరైంది కాదన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకు మావోయిస్టులు ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని, ఎవరూ భయపడవద్దని ఎస్పీ సూచించారు.

ఇన్‌ఫార్మర్ హత్య?

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా మినప సమీపంలో ఇన్‌ఫార్మర్ నెపంతో ఓ గిరిజనుడిని గురువారం సాయంత్రం నక్సలైట్లు హతమార్చినట్లు సమాచారం. మృతదేహం వద్ద కరపత్రాలు వదిలారు. సాయంత్రం కావడంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లలేకపోయారు. శుక్రవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించే అవకాశాలు ఉన్నాయి. ఈ ఘటనను అధికారికంగా ధ్రువీకరించలేదు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఓ వ్యక్తిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని పేరాయిగూడెం గ్రామ పంచాయతీకి చెందిన ఓ ఇరవై ఏళ్ల యువతిని అదే ప్రాంతానికి చెందిన దేవరపల్లి సుభాష్ వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడి పందేలు ఆడుతున్న ఏడుగురిపై..

దమ్మపేట: మండల పరిధిలోని అల్లిపల్లి గ్రామశివారులో కోడి పందేలు ఆడుతున్న ఏడుగురిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై రవికుమార్ తన సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేశారు. మూడు కోడి పుంజులు, మూడు బైక్‌లు, రూ.3600 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు పందెం రాయుళ్లపై కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని బస్టాండ్ వద్ద ఓ వ్యక్తి మృతి చెంది ఉండగా, స్థానిక దుకాణదారులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మద్యం మత్తులో మృతి చెంది ఉండవచ్చని దుకాణదారులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు పంచనామా నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడు ఎర్రరంగు చొక్కా, నలుపు రంగు కలిగిన గళ్ల ప్యాంట్ ధరించి ఉన్నాడని, వయసు సుమారు 45 ఏళ్లు ఉండవచ్చని స్థానికులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

బూర్గంపాడు: మండల పరిధిలోని బుడ్డగూడెం గ్రామం వద్ద కిన్నెరసాని నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలోని చెరువు కట్ట పెద్దమ్మ తల్లి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. సుమారు రూ.70 వేల విలువైన అమ్మవారి ఆభరణాలను అపహరించినట్లు ఆలయం పూజారి శివకామేశ్వరశర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రాఖీ రోజే అన్నాచెల్లెలి జననం !


సాయిగీత, కవల పిల్లలతో డాక్టర్ శ్రీక్రాంతి

భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఓ మహిళ గురువారం కవలలకు జన్మనిచ్చింది. బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజరకు చెందిన పాండవుల సాయిగీతకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు సురక్ష ఆస్పత్రిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆమెకు శ్రీక్రాంతి, అక్కినేని లోకేష్ ప్రసవం చేశారు. ఈమేరకు మొదటగా అబ్బాయి, ఆతర్వాత అమ్మాయి జన్మించడంతో రాఖీ పండుగ సందర్భంగా అన్నాచెల్లి జన్మించినట్లుగా భావిస్తూ సాయిగీత కుటుంబీకులు హర్షం వ్యక్తం చేశారు.

– భద్రాచలంఅర్బన్

రెడీ...1,2,3!

- ‘అగ్నివీర్’ ర్యాలీకి సర్వం సిద్ధం
- నేటి నుంచి అభ్యర్థులకు ఫిజికల్ టెస్ట్‌లు
- ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- అర్ధరాత్రి 12.30 గంటల నుంచే పోటీల ప్రారంభం


9 ఫీట్ల జంప్ చేసే రన్ వే

ఖమ్మం స్పోర్ట్స్: సైన్యంలో నియామకాలకు సంబంధించి అగ్నివీర్ ర్యాలీ శుక్రవారం నుంచి ఖమ్మం జిల్లా కేంద్రంలో జరగనుంది. ఇందుకోసం సర్దార్ పటేల్ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఫిజికల్ టెస్ట్‌ల నిర్వహణ కోసం ఏడుగురు నోడల్ ఆఫీసర్లను నియమించారు. స్టేడియంలో ట్రాక్ చుట్టు బారికేడ్లు ఏర్పాటు చేసి ఇతరులు లోపలకు రాకుండా ఆంక్షలు విధించారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే రాతపరీక్షలో ఉత్తీర్ణులైన ఏడు వేల మందికి పైగా అభ్యర్థులు ఫిజికల్ టెస్ట్‌కు హాజరుకానున్నారు. రోజుకు 1,200 మంది చొప్పున హాజరయ్యేలా అధికారులు అడ్మిట్ కార్డులు జారీచేశారు.

బయోమెట్రిక్‌తో మొదలు..

నిర్ణీత తేదీల్లో అభ్యర్థులు వచ్చేలా అధికారులు అడ్మిట్ కార్డులు జారీ చేశారు. అభ్యర్థుల వివరాలను తొలుత బయోమెట్రిక్ విధానంలో నమోదు చేస్తారు. అనంతరం ఎత్తు, బరువు పరీక్షించాక 1,600 మీటర్ల పరుగు, 9 ఫీట్ల జంప్, జెడ్ ఆకారం మాదిరి క్రాస్‌బార్‌పై నడిచే పోటీ నిర్వహిస్తారు. మొదటగా వంద మంది చొప్పున 1,600 మీటర్ల పరుగుకు అనుమతిస్తారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని నిర్దేశిత బాక్సుల్లోకి పంపిస్తారు. ఆతర్వాత 9 ఫీట్ల జంప్, పుష్ అప్స్, జెడ్ క్రాస్ బార్‌పై నడిచే పరీక్షలు నిర్వహిస్తారు. ఈ టెస్ట్‌లు ముగిసిన మరుసటి రోజు ఫిజికల్ టెస్ట్ ఉంటుంది. కాగా, ప్రతీ ఈవెంట్ వద్ద సీసీ కెమెరాలు బిగించగా, పర్యవేక్షణ కోసం పెద్ద టీవీ ఏర్పాటు చేశారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం నుంచి 8వ తేదీ వరకు జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆర్మీ అధికారులు స్టేడియంలోకి ఇతరులను అనుమతించడంలేదు. ముందుగా అభ్యర్థులు ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలోకి వచ్చి బయోమెట్రిక్ హాజరు నమోదు చేయించుకున్న తర్వాతే స్టేడియంలోకి అనుమతిస్తారు. ఎక్కడ కూడా తోపులాట జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రతిరోజు అర్ధరాత్రి రాత్రి 12.30 గంటలకు ప్రారంభమయ్యే పోటీలు ఉదయం 8 గంటల్లోగా ముగించనున్నారు. ఖమ్మం పోలీసులతో పాటు ఆర్మీ సిబ్బంది భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

సింగరేణి(కొత్తగూడెం): ఉద్యోగ విరమణ పొందిన సింగరేణి అధికారులను గురువారం ఘనంగా సన్మానించారు. సంస్థ ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ బి.వెంకటేశ్వరరావు(బీవీ రావు) ఉద్యోగ విరమణ పొందగా, వైద్యసిబ్బంది సత్కరించారు. కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సీహెచ్‌పీ డీజీఎంగా పనిచేసిన వి.వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ పొందగా, అధికారులు సత్కరించారు. నూతన సీఎంఓ సుజాత, జీఎం ఎ.శాలెంరాజు, అధికారులు సునీల, మిస్‌షాలి మాట్రన్, ఎం. శ్రీనివాస్, సుజ్ఞాన్, పి. శ్రీనివాస్, సీహెచ్ రామకృష్ణ, కె.హన, సుమలత, శ్రీరమేష్, బి.రవీందర్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత


అశ్వారావుపేటలో పోలీసులు పట్టుకున్న పశువుల వాహనం

బూర్గంపాడు/అశ్వారావుపేటరూరల్/పాల్వంచ: అక్రమంగా పశువులను తరలిస్తున్న ఓ వాహనాన్ని గురువారం అశ్వారావుపేట పోలీసులు పట్టుకున్నారు. స్థానిక సరిహద్దు చెక్ పోస్టు వద్ద ఎస్సై పి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమతులు లేకుండా బొలెరో వాహనంలో ఏపీలోని తుని నుంచి సూర్యాపేట సంతలో విక్రయించేందుకు 17 పశువులను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా రవాణా చేస్తున్న వ్యాపారి తాజ్, డ్రైవర్ బాబ్జీలపై కేసు నమోదు చేశారు. పట్టుకున్న పశువులను పాల్వంచలోని అన్నపూర్ణ గో సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. కాగా గోశాలకు తరలించిన వాటిలో మూడు గోవుల పరిస్థితి విషమంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.

సారపాకలో..

గోవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని బూర్గంపాడు మండలంలో పోలీసులు పట్టుకున్నారు. సారపాకలో వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో అనుమతులు లేకుండా ట్రాలీ ఆటోలో గోవులను తరలిస్తున్న వాహనాన్ని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గోవులను పాల్వంచ గోసంరక్షణ కేంద్రానికి తరలించారు. నెల్లిపాక నుంచి పండితాపురం సంతకు తోలుకెళ్తున్న సోమ్లా, దుర్గ, రమేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.